క్లుప్తంగా

శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు

కాళ్ల: మండలంలోని కాళ్లకూరులో ఉన్న స్వయంభూ శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో సప్తనదీ జలాభిషేక పూర్వక పవిత్రోత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా భాగంగా మూడో రోజైన గురువారం స్వామి, అమ్మవార్లకు యాగశాల అర్చన, హోమములు, కుంభా వాహన, చక్రాబ్ది మండలార్చన , పవిత్రా ధివాసం, కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా స్వామివారికి యాగశాల అర్చన, నిత్యోపాసన, నారసింహ, సుదర్శనహోమములు, చక్రాబ్ది మండలార్చన, పవిత్రాదివాసం కార్యక్రమాలు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను ఈఓ ఎం.అరుణ్‌కుమార్ పర్యవేక్షించారు.

నేడు యూత్‌క్లబ్‌లో ఉచిత మెగా మెడికల్ క్యాంప్

భీమవరం: భీమవరం యూత్‌కల్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మెగా మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు యూత్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పేరిచర్ల శ్రీనివాసరాజు(సుభాష్), జాయింట్ సెక్రటరీ వేగేశ్న రామకృష్ణంరాజు చెప్పారు. గురువారం ఉచిత వైద్యశిబిరం బ్రోచర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడుతూ యూత్ క్లబ్ ఆవరణలో నిర్వహించే వైద్యశిబిరంలో గ్యాస్ట్రిక్, గాల్‌బ్లాడర్, హెర్నియా, లివర్ సంబంధిత సమస్యలు, జనరల్ చెకప్ వంటివాటికి ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారని సుభాష్, రామకృష్ణంరాజు తెలిపారు. ఈ అవకాశాన్ని భీమవరం పట్టణం, పరిసర ప్రాంతాల ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

నూనె, చక్కెర వాడకం తగ్గించాలి

కాళ్ల: రోజు వారీ తినే ఆహారంలో నూనె, చక్కెర వాడకం తగ్గించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పీహెచ్‌సీ వైద్యురాలు సునీత సూచించారు. మండలంలోని కాళ్లకూరులో 'సుపోషిత్ భారత్, సక్షం భారత్' కార్యక్రమంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా చిన్నారులకు పౌష్టికాహారం అందజేశారు. చిరు ధాన్యాలైన రాగులు, సజ్జలు, జొన్నలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. కిశోర బాలికలకు ఎత్తు, బరువు చూసి బాడీమాస్ ఇండెక్స్‌ను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాధు శ్రీదేవి, అంగన్‌వాడీ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మతోన్మాదాన్ని వ్యతిరేకించాలి

ఆకివీడు: మతోన్మాదాన్ని వ్యతిరేకించి, అటువంటి చర్యలకు పాల్పడుతున్న పార్టీలను, నాయకులను తీవ్రంగా ప్రతిఘటించాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు మంతెన సీతారామ్ పిలుపునిచ్చారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏచూరి సీతారామ్ ఏచూరి ప్రథమ వర్ధంతి కార్యక్రమం గురువారం నిర్వహించారు. పెంకి అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కె.తవిటినాయుడు, బీవీ.వర్మ, డి.రవితేజ పాల్గొన్నారు.

అనారోగ్య బాధితురాలికి ఆర్థిక సాయం

పాలకోడేరు: మండలంలోని కుముదవల్లి గ్రామంలో ఉన్న ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు క్లీనర్‌గా పని చేస్తున్న యండగండి గ్రామానికి చెందిన అప్పలనాయుడు భార్యకు రొమ్ము క్యాన్సర్ వ్యాధి సోకడంతో తీవ్ర అనారోగ్యంతో చాలా కాలంగా మంచానికి పరిమితమైంది. అప్పలనాయుడు ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావడంతో కొద్దిపాటి జీతంతోనే వయస్సు పై బడిన దంపతులు ఇంటి ఖర్చులతో పాటు ఆస్పత్రికి వెళ్లి అరకొరా మందులు తెచ్చుకుని ఇంటి దగ్గరే కాలక్షేపం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్కూల్ ఆటో కార్మికులు ఆమె మందుల ఖర్చు నిమిత్తం రూ.12,000 స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణంరాజు చేతుల మీదుగా అప్పలనాయుడుకు గురువారం అందజేశారు.

తూకంలో అక్రమాలు చేస్తే సహించం

పాలకోడేరు: సరుకుల పంపిణీలో తూకాలు తేడా లేకుండా సక్రమంగా ఉండేలా చూసుకోవాలని, అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని లీగల్ మెట్రాలజీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ మోహన్ సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మండలంలోని రేషన్ షాపుల కాటాలను తనిఖీ చేసి, సీళ్లు వేశారు.

ఆర్‌ఓబీ పనులతో అవస్థలు

ఉండి: ఉండి రైల్వే గేటు వద్ద జరుగుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జ్(ఆర్వోబీ) పనులతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎలంటి సమాచారం లేకుండా గురువారం ఉదయం 11 గంటల సమయంలో ఉండి సెంటర్, పెదపుల్లేరు రోడ్డు వద్ద బ్యానర్‌లు కట్టి జాతీయ రహదారిపై రైల్వేగేటు మూసివేసి పనులు ప్రారంబించడంతో ప్రయాణికుల ఇబ్బందులకు తీవ్రమయ్యాయి. గతంలో ఆర్‌బీ పనులు చేపట్టే కనీసం వారంరోజుల ముందు నుంచే సమాచారం ఇచ్చే అధికారులు ఈ సారి కనీస సమాచారం ఇవ్వడం మరచారని ఇష్టానుసారం పనులు చేపట్టారని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణం అవసరమే అయితే కనీస సమాచారం ఇస్తే వేరే దారుల్లో గమ్యాలు చేరుకుంటాం కదా? అంటూ మహిళా ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేసారు. గురువారం చేపట్టిన ఆర్వోబీ పనులు ఈ నెల 23 వరకు కొనసాగుతాయని ప్రాజెక్టు మేనేజర్ యశ్వంత్‌కుమార్ తెలిపారు. ఉదయం11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనులు జరుగుతాయని ప్రయాణికులు, వాహనదారులు గమనించాలని తెలిపారు.

రూటు మార్పు ఇలా

భీమవరం నుంచి ఆకివీడు వైపు వెళ్ళేవారు జువ్వలపాలెం రోడ్డులో వెళ్లాలని ఉండి నుంచి ఆకివీడు వెళ్ళేవారు పాముపర్రు నుంచి పెదకాపవరం మీదుగా లేదా వాండ్రం నుండి పెదపుల్లేరు మీదుగా ఉండి వచ్చి వెళ్లాలి. ఐదురోజుల పాటు నిర్వహించాలని తలపెట్టిన పనులు త్వరగా జరిగిపోతే ముందుగానే రైల్వేగేటు తెరుస్తారని యశ్వంత్ కుమార్ తెలిపారు.



ఉండిలో ఆర్‌ఓబీ నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): పేదరికం లేని సమ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని సీపీఓ కంటిపూడి శ్రీనివాసరావు అన్నారు. పి- 4 కార్యక్రమం అమలులో భాగంగా గురువారం పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా ప్రణాళికా శాఖ గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ పేదరికంలేని సమాజ నిర్మాణానికి ముఖ్యమంత్రి అత్యంత ప్రతిష్టాత్మకంగా పి-4 కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారన్నారు. ప్రభుత్వ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలన్నారు. ఈరోజు శిక్షణ కార్యక్రమానికి హాజరైన సిబ్బంది ఈనెల 23వ తేదీన గ్రామ, మండల, మున్సిపల్ స్థాయిలలో మిగిలిన సిబ్బందితో సమావేశాలు ఏర్పాటు చేసి వారికి పీ-4 కార్యక్రమంలో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ప్లానింగ్ శాఖ తరపున అసిస్టెంట్ డైరెక్టర్ రోహిణి కుమారి, జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సిపిఓ కంటిపూడి శ్రీనివాసరావు

మానవత సంస్థకు వసుధ ఫౌండేషన్ సహకారం

భీమవరం: భీమవరం మానవత సంస్థ నిర్వహించే వివిధ సేవా కార్యక్రమాలకు స్పందించిన వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు రూ. రెండు లక్షల చెక్కును అందజేశారు. గురువారం గాంధీ కస్తూరిబా భవనంలో వసుధ ఫౌండేషన్ భీమవరం కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు చేతుల మీదుగా మానవతా సంస్థ చైర్మన్ బుద్ధరాజు వెంకటపతిరాజు, అధ్యక్షుడు చింతలపాటి రామకృష్ణంరాజులకు అందజేశారు. ఈ సందర్బంగా ప్రసాదరాజు మాట్లాడుతూ గత రెండున్నరేళ్లుగా మానవతా సంస్థ నిర్వహించే సేవా కార్యక్రమాలతో పాటు, వసుధ ఫౌండేషన్ నిర్వహించే కార్యక్రమాల్లో తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారని మానవతాసంస్థ మరిన్ని సేవాకార్యక్రమాలు నిర్వహించాలని వసుధ ఫౌండేషన్ ఆర్థిక సహకారం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ గౌరవ డైరెక్టర్ పెన్మెత్స రామ్మోహనవర్మ, కో చైర్మన్ కార్మూరి నర్సింహమూర్తి (బాబు), ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ఎన్ రాజు, ఎస్‌కె చాన్ బాషా, కలిగొట్ల గోపాలశర్మ, అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.



భీమవరంలో మానవతాసంస్థకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు అత్యధిక ప్రాధాన్యత

భీమవరం: ప్రపంచ వ్యాప్తంగా సమాచార, సాంకేతిక రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయని వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించుకు రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై సదస్సు ఏర్పాటు చేసినట్లు భీమవరం డీఎన్నార్ కళాశాల ప్రిన్సిపల్ జి మోజెస్ అన్నారు. గురువారం కళాశాలలో నిర్వహించిన సదస్సులో టెక్ మహేంద్ర కంపెనీ సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బి సతీష్, డి భరత్‌లు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లకు అత్యధిక ప్రాముఖ్యత ఉంటుందని అవిలేని సమాజాన్ని ఊహించలేమన్నారు. విద్య, వైద్య, శాస్త్ర, సాంకేతిక, ఉత్పాదక, సేవా వంటి అనేక రంగాల్లో అవి ప్రముఖ పాత్ర వహిస్తాయని తద్వారా ఉద్యోగ అవకాశాలు పెరిగే అవకాశమున్నందున విద్యార్థులు తప్పనిసరిగా వాటిపై శిక్షణ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకట నర్సింహ రాజు, గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, పి.రామకృష్ణంరాజు పాల్గొన్నారు.



భీమవరం డీఎన్నార్ కళాశాలలో ఏర్పాటుచేసిన సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

రాష్ట్రస్థాయిలో విద్యార్థుల ప్రతిభ

భీమవరం: ఏలూరు జిల్లా పెదవేగి సోషల్ వెల్ఫేర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించే 69వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్- 19 నెట్‌బాల్ రాష్ట్రస్థాయి బాల, బాలికల పోటీలకు భీమవరం సీఎస్ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ ఎండీ సలీంఖాన్ చెప్పారు. క్రీడాపోటీలను ఎంపికైన విద్యార్థులను గురువారం కళాశాలలో అభినందించారు. బాలుర విభాగంలో ఎండి జుబేర్, ఎం వేణుగోపాల్, కె హసుక్, డి రాజేష్, కె భాస్కరరావు, బి రాజేష్, స్టాండ్‌బైగా జీవీ సత్యనారాయణ, కె బాలసాయి రామకృష్ణ, ఎస్ తేజ కార్తికేయలు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో ఎం జాన్సీలక్ష్మి, ఎం బేబీ రాణి, టి ఉమాభవాని, ఎస్ వెంకట రేష్మ, డి హరిణి ప్రియ, కె. రాము, స్టాండ్ బైగా కె మౌనిక, ఎంఎస్ ఎస్ మౌనిక ఎంపికయ్యారని సలీం ఖాన్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చీడే సత్యనారాయణ, ట్రెజరర్ వడుపు గోపి, కోచ్ దావుద్ ఖాన్ తదితరులు అభినందించారు.



రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

గునుపూడి శివాలయానికి ట్రస్ట్ బోర్డు నియామకం

భీమవరం (ప్రకాశం చౌక్): ప్రముఖ పంచారామ క్షేత్రం శ్రీ సోమేశ్వర జనార్ధన స్వామి దేవస్థానం పాలకమండలిని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ట్రస్ట్ బోర్డు సభ్యులుగా చింతలపాటి బంగార్రాజు, బి సత్యప్రసాద్, బి. కృష్ణవేణి, పి.లీల, పి.వెంకట రామకృష్ణ, సాయి నాగేంద్ర విజయలక్ష్మి కుమారి, వై.రమేష్, బి.రమణ, పి.శ్యామ్‌కుమార్, పి.జ్యోతిర్మయి, కె.విజయకుమార్, అర్చకులు కందుకూరి సోమేశ్వరరావు ఎక్స్ అఫీషియో నియమిస్తూ దేవదాయ శాఖ అధికారులకు ఉత్తర్వులు పంపించారు. రెండు సంవత్సరాల కాలపరిమితితో ట్రస్ట్ బోర్డును నియమంచించారు. కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేసి, ట్రస్ట్ బోర్డు చైర్మన్ చింతలపాటి బాపిరాజును ఎన్నుకున్నారు.

22న స్కూల్ గేమ్స్ ఎంపికలు

వీరవాసరం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22న ఫెన్సింగ్, బాక్సింగ్, టేబుల్ టెన్నిస్, మాల్కంబీ టెన్నిస్ క్రీడల్లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు స్కూల్‌గేమ్స్ కార్యదర్శులు డీ సునీత, ఎస్ఎన్ మల్లేశ్వరరావు తెలిపారు. అండర్ 14, అండర్ 17 బాలురు, బాలికలు ఫెన్సింగ్ క్రీడా పోటీలు శృంగవృక్షం జడ్పీ హైస్కూల్, వీరవాసరం జడ్పీ హైస్కూల్‌లో బాక్సింగ్ పోటీలు, భీమవరం చింతలపాటి మున్సిపల్ హైస్కూల్‌లో టేబుల్ టెన్నిస్, మాల్కంబీ పోటీలు, భీమవరం టెన్నిస్, లాండ్ టెన్నిస్ పోటీలు పాలకొల్లులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికకు హాజరైయ్యే క్రీడాకారులు ఉదయం 10 గంటలకు ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరం ఇండోర్ విద్యుత్ ఉపకేంద్ర పరిధిలో సబ్‌స్టేషన్ మైంటెనెన్స్, కేబుల్ కిట్స్ మార్పు కారణంగా పట్టణంలోని వివిధ ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చిన్న మసీద్, మావుళ్లమ్మ గుడి వీధి, సర్రాజు వారి వీధి, తటవర్తి వారివీధి, రెస్ట్ హౌస్‌రోడ్, వెంకయ్య నాయుడు వీధి, గంగానమ్మ గుడి ఏరియా, యనమదుర్రు కాలువ గట్టు, సండే మార్కెట్, భీమేశ్వర స్వామి గుడి రోడ్, బ్యాంక్ కాలనీ ఏరియా, టౌన్ హాల్ రోడ్డు, కురిశేటి వారి వీధి, గవర్నమెంట్ హాస్పటల్ రోడ్డు, తాలూకా ఆఫీస్ రోడ్డు, సుంకర పద్దయ్య వీధి, శంకర్ మఠం ఏరియాకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వెంకటేశ్వరరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వ్యాసరచన, డిబేట్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

భీమవరం: వారధి ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యాశాఖ వార్షిక విద్యార్థుల పోటీలు గురువారం భీమవరం పట్టణంలోని పీఎస్ఎం బాలికల పాఠశాలలో నిర్వహించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఇ నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో వ్యాసరచన, డిబేట్ పోటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డిబేట్ పోటీల్లో వీరవాసరం మండలం రాయకుదురు జిల్లాపరిషత్ హైస్కూల్ విద్యార్థులు పుచ్చకాయల వెన్నెల ప్రథమ స్థానం, దూడి అంజలి ద్వితీయస్థానం సాధించారన్నారు. వ్యాసరచన పోటీల్లో పాలకోడేరు మండలం వేంద్ర జిల్లాపరిషత్ హైస్కూల్ విద్యార్థులు వి కృతిక ప్రథమస్థానం, సింగంశెట్టి యురేఖ ద్వితీయస్థానం పొందారన్నారు. ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థులు వచ్చే నెల 6వ తేదిన రాష్ట్రస్థాయిలో ఆన్‌లైన్‌లో నిర్వహించే వ్యాసరచన, 8వ తేదిన డిబేట్ పోటీల్లో పాల్గొంటారని విద్యాశాఖాధికారి నారాయణ తెలిపారు.

వ్యక్తి కనిపించడం లేదంటూ ఫిర్యాదు

భీమవరం: భీమవరం టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని రాయలం గ్రామానికి చెందిన కోనాల రాంబాబు కనిపించడం లేదంటూ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.రామారావు చెప్పారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే రాంబాబు గురువారం తెల్లవారుజామున ఇంటిలో వాష్‌రూమ్‌కు వెళ్తున్నట్లు చెప్పి తిరిగి రాలేదని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామారావు తెలిపారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

భీమవరం: భీమవరం రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు చెందిన 22 ఏళ్ల యువతి ఆచూకీ లేదని ఆమె తండ్రి ఫిర్యాదు చేశారని సీఐ జి. కాళీచరణ్ తెలిపారు. ఇంటి నుంచి వెళ్లిపోవడానికి గల కారణాలను కుటుంబ సభ్యుల నుంచి తెలుసుకుంటున్నామన్నారు.

చలో మెడికల్ కాలేజీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

భీమవరం అర్బన్: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన ఛలో మెడికల్ కాలేజీ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బేతాళ సంతోష్ కుమార్ గురువారం తెలిపారు. మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఎంతో కష్టపడి రాష్ట్రానికి 17 మెడికల్ కళాశాలలు తీసుకువచ్చారన్నారు. వాటిని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్రైవేటీకరణ చేస్తున్నారని పేర్కొన్నారు. మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ చేస్తే పేద విద్యార్థులు మెడికల్ సీట్లు రావన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు, విద్యార్థులకు ఉపయోగపడేలా చేయకుండా ప్రైవేటీకరణ చేస్తే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.



సంతోష్ కుమార్

మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌కు ఇవ్వడం దారుణం

ఉండి: రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఏర్పాటుకు నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తే నేటి కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు వాటిని ప్రైవేటుకు అమ్మేయడంతో ప్రభుత్వం తన బాధ్యతను మరచిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి జి.సుందర్‌కుమార్ మండిపడ్డారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. మెడికల్ కళాశాలల అభివృద్ధికి గతంలో జగన్‌మోహన్‌రెడ్డి కొన్నిసీట్లు పేమెంట్ సీట్లుగా ఏర్పాటు చేస్తే మెడికల్ సీట్లు అమ్ముకుంటున్నాడంటూ రాద్ధాంతం చేసిన ఎల్లో మీడియా ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదని తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైన ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సుందర్‌కుమార్

ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మృతి

వీరవాసరం: వీరవాసరం మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కేవీ రమణాచార్యులు(48) గుండెపోటుతో మృతి చెందారని కార్యాలయ సిబ్బంది గురువారం తెలిపారు. విధులకు సెలవు పెట్టి రెండురోజుల క్రితం పెద్ద తిరుపతికి స్వామివారి దర్శనానికి వెళ్లినట్లు తెలిపారు. మెట్ల మార్గంలో ప్రయాణిస్తూ అలసటతో నీరసంగా ఉంటూనే క్యూలైన్ లోనే రమణాచార్యులు దైవదర్శనానికి వెళ్లారు. అక్కడే తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఆరోగ్య సిబ్బంది సీపీఆర్ చేసి వెంటనే ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో మార్గంలోనే ఆయన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. స్వగ్రామం పాలకొల్లుకు మృతదేహాన్ని తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆయన మృతిపై ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని, అధికారులు సంతాపం తెలిపారు.

ప్రతి ఒక్కరూ విద్యలో రాణించాలి

వీరవాసరం: పట్టుదలతో చదువుకొని అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని రాయకుదురు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం కానుకొలను శ్రీనివాసరావు అన్నారు.గురువారం పాఠశాల ఆవరణలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులకు పాలకొల్లు వాకర్స్‌క్లబ్ ఆర్థిక సహకారంతో అందించిన నోటు పుస్తకాలను ఆయన చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్బంగా హెచ్ఎం మాట్లాడుతూ జీవితంలో రాణించాలంటే చదువుపై శ్రద్ధ ఉండాలన్నారు. బాగా చదవుకున్న వారు మాత్రమే పేదరికం నుంచి ఉన్నతస్థాయికి వస్తారని దానికి చదువు ఒక్కటే మార్గమని గుర్తుంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో క్లబ్ చైర్మన్ టీ సుధాకరరావు, కార్యదర్శి షేక్ పీర్‌సాహెబ్, సభ్యులు, లెక్చరర్స్ కుమార్, సాకా వరప్రసాద్, కే బాలకృష్ణ, సీహెచ్ కిరణ్‌కుమార్, ఎం అరుణ, కాయల వీరస్వామీ, కేవీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మిడి రాజేంద్రను పరామర్శించిన చినమిల్లి



రాజేంద్ర కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని దెయ్యాలతిప్ప గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ బొమ్మిడి బాబు రాజేంద్రప్రసాద్‌ను గురువారం ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకటరాయుడు పరామర్శించారు. గత కొంతకాలంగా బొమ్మిడి రాజేంద్రప్రసాద్ సతీమణి వరలక్ష్మి అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. దీంతో బాబు రాజేంద్రప్రసాద్ కుటుంబ సభ్యులను పరామర్శించి అధైర్య పడవద్దని పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంధి యోహాన్, అమిరపు భీమరాజు, నల్లగంగుల జ్ఞానరాజు, మాజీ ఎంపీటీసీ పెనుమాల నరసింహస్వామి, సీనియర్ నాయకులు గుద్దటి ఆంజనేయులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

భీమవరం సబ్‌జైల్‌ను సందర్శించిన న్యాయమూర్తి



భీమవరం సబ్ జైల్‌ను పరిశీలిస్తున్న జడ్జి హనీష

భీమవరం: పట్టణంలోని ప్రత్యేక సబ్‌జైలును ఒకటవ అదనపు జ్యుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ పి హనీష గురువారం సందర్శించి ముద్దాయిలను కలిసి కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా జడ్జి మాట్లాడుతూ న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్తోమతలేనివారు దరఖాస్తు చేసుకుంటే న్యాయాధికారసంస్థ తరఫున ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామన్నారు. ఇప్పటికే బెయిల్ మంజూరైనవారు ష్యూరిటీలు కోర్టుకు సమర్పిస్తే పరిశీలించి విడుదల చేస్తామన్నారు. అనంతరం జడ్జి హనీష జైలు పరిసరాలను, మహిళా బ్యారక్, వంట గదిని పరిశీలించి ముద్దాయిలకు ఇస్తున్న భోజనాన్ని రుచి చూశారు. ప్యానల్ న్యాయవాదులు అంబేద్కర్, జ్యోతి, సురేష్ కుమార్, లోకేశ్వరరావు, మీడియేటర్ న్యాయవాది విజయలక్ష్మి, పారా లీగల్ వలంటీర్స్ శ్రీలక్ష్మి, నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.